

# తెల్లదయ్యం అను గ్రామవివక్ష కథ

స్వామి

పాత మనిషి పాతన్న! కాయకష్టంతో నల్లగా మొద్దుబారిన శరీరం. వారంరోజులు దుమ్ము స్నానం. ఒకరోజు నీటి స్నానం. విత్తులు నాటితే మొలకెత్తే మట్టిదేహం. మట్టి మనిషి పాతన్న.

అతని అవయవాలు బహు చిత్రం. కండల్లో ఎద్దు బలం. కాళ్లలో బండిచక్రాల వేగం. అతని చేతులు పగ్గాల్లా సాగుతాయి. మట్టిని మడకల్తో తిరగ్గొట్టి ఎర్రని సూర్యకాంతి కింద పరుస్తాడు. మట్టిలోకి కొంచెం వర్షమూ, కొంచెం ఆకాశమూ కలిపి విత్తు లోపల జీవం మేల్కొనే గుడ్డు వాతావరణాన్ని పక్వం చేస్తాడు. ఆది పురుషుడి వీర్యకణాల్లా చిమ్ముతాడు విత్తనాల్ని భూగర్భంలోకి! అతని చేతివేళ్లలో నుంచీ కోట్ల కోట్ల ప్రాణాల్ని మొలకెత్తించే వేడుక అలా సాగిపోతుంది. గింజలకు తోకలు పుట్టి నాటుకుంటాయి భూమిలో. మొక్క తన తిండి కోసం ఆకాశపు వేటలో పడుతుంది. ఒకటి అనేకమై మారే సృష్టిలీలలో మొక్క విత్తనపు బద్దల్ని సన్యసించి ధాన్యాన్ని విరగకాస్తుంది.

విత్తులో ప్రాణం రాజేసే విద్య తప్ప మరో నాగరికత తెలీదు పాతన్నకు! ద్రవ్యవ్యవస్థలో అతనికొక మోసం జరిగిపోయింది. ఒక గింజకు పది గింజలు పుట్టించగల పాతన్న- ఆ గింజల్ని రూపాయిలోకి మార్చుకోగానే రూపాయికి మరో రూపాయిని పుట్టించే అవకాశం నుంచీ దూరం చెయ్యబడ్డాడు. ఆ అవకాశాన్ని వ్యాపార నాగరికత స్వంతం చేసుకున్నప్పటి నుంచీ అతన్ని ఒక మాయరోగం పట్టుకుని వేధిస్తోంది.

ఆరోజు-

పొద్దున్నే పేడా కసువు ఎత్తేద్దామని గాటి దగ్గరకు పోయాడు పాతన్న. ఎద్దుల్లేవు.

"ఏమే? ఎద్దులేవీ?"

"ఏమో," అంది భార్య బోసిమెడ తడుము కుంటూ.

అవి రామన్నలక్ష్మన్నలు. కవలలు. తన ఇంట్లోనే పుట్టి పెరిగాయి. ఏడేండ్లుగా చాకిరీ చేశాయి.

అయ్యో అనుకుని ఏదో అనుమానమొచ్చి బైటికి పరుగెత్తి చూశాడు. బండి లేదు.

"ఏమే? బండేదీ?"

"ఏమో!" అంతే విసుగ్గా అంతే గట్టిగా అరిచింది భార్య.

ఎట్లాంటి బండి. తన తండ్రి కాలం నాటి బండి. ఇప్పుడు అటువంటి చెక్కా దొరకదు, అంత పని తనమూ కన్పించదు. రథంలాంటి బండి కదా!

ఇంట్లోకి వస్తుంటే మూలనున్న వడ్లబస్తాలు ఒక్కొక్కటి ఎగిరిపోతున్నాయి.

"ఒసేయ్! బిరింగరా! పట్టుకుందాం. తిండి గింజలు కూడా ఎగిరిపోతాండాయి."

"పొయ్యేది పోతుంది. ఉండేది ఉంటుంది," అని వేదాంతధోరణిలో చూసింది భార్య.

"మీయమ్మ నీకేమొచ్చిందే ఈ పొద్దు," అని ఒక వడ్లమూటకు అడ్డంపడ్డాడు. పదహారేండ్ల కొడుకొచ్చి మరో మూటకు అడ్డంపడ్డాడు. రెండు బస్తాలు మిగిలితే, అమ్మయ్యా అని ఊపిరి పీల్చుకున్నాడు.

బంగారంలాంటి వడ్లు. సంవత్సరమంతా తినీ, కుడిచీ, పదిమందికి పెట్టినా తరిగిపోని ధాన్యరాశులు. ఏవీ? ఎక్కడ పోయినాయి?

పాతన్న కడుపులోకింత మేత పడేసుకుని కూలి వేటకు బయల్దేరాడు. పాతన్న కుటుంబం రెండెకరాల తోటలో సేద్యమూ చేస్తారు. పెద్ద రైతుల కింద కూలికీ పోతారు.

“నువ్వెక్కడికి పోతున్నావు కూలికి?”

‘ఏమో’, నాకేం పట్టిందన్నట్లు చేతులు గాల్లోకెగ రేసింది భార్య.

“ఏదో ఒక పని వెతుక్కోకపోతే ఎట్ల బతుకుతామే ముండా?”

“నువ్వు బతక్కపోతే సావు! నా మెడలో తాళి బొట్టు మాయమై నేనేడుస్తుంటే, మధ్యలో నీదొకటి.”

“ఆ..., అదీ విషయం!” అనుకుని ఎల్లమ్మకట్ట దగ్గరికి వచ్చాడు. అక్కడ గుంపులు గుంపులు మనుషులు. మనిషికి పనులు లేకపోవడమేమిటి? ఎన్ని పనులు? గోళ్లు గిల్లుకుంటూ, తలలు బరుక్కుంటూ, ఈగలు చంపుతూ, అక్కడికీ పొద్దుపోకపోతే మొగుడూ పెళ్లాలు తిట్టుకుంటూ, కొట్టుకుంటూ, ఆ ఇద్దరూ ఏకమై పసిపిల్లల్ని బాదుతుంటే- కొరికేసిన గోళ్లూ, చచ్చిన ఈగలూ, తెగిపోయిన వెంట్రుకల గుట్టలూ దాటుకుంటూ పాతన్న నడుస్తుండగా కుమ్మరి తిప్పన్న ఎదురయ్యాడు.

అతడు, “అన్నా పాతన్నా! నా సారె చూస్తివా?” అని అడిగితే, “నా ఎద్దులు చూస్తివా?” అని అడిగాడు.

గాండ్ల వెంకటేశులు ఎదురై, “అన్నా! నా గానుగ మర చూస్తివా?” అని అడిగితే, “నా బండి పోయింది చూస్తివా?” అని అడిగాడు.

వడ్డే రాముడు ఎదురై, “నా సమ్మెటా, గడారూ చూస్తివా?” అని అడిగితే, “లేదన్నా! నా వడ్లమూటలు చూస్తివా?” అన్నాడు.

నేసే మునయ్య ఎదురై, “అన్నా! నా మగ్గం చూస్తివా,” అని అడిగితే, “లేదుగానీ, నా పెళ్లాం మెడ లోని తాళిబొట్టు పోయింది చూస్తివా?” అని వచ్చేశాడు.

‘ఈ ఊరికేదో మాయదారి రోగమొచ్చింది. ఎప్పుడు ఏం మాయమైపోతుందో తెలీదు. మనుషులకు మనుషులే మాయమైపోతున్నారు,’ అని నిట్టూర్పు విడిచేంతలో టౌను నుంచి బస్సు దిగిన ఎరువుల షాపు యజమాని అప్పుపడ్డ రైతుల్ని తరుముతూ కన్పించాడు. చప్పున పాతన్న తాబేలుగా మారి, డిప్పలోకి తలను ముడుంగున ముడిచాడు. హాయి హాయి తాబేటి జన్మ అనుకుని ముఖాన్ని మళ్లీ బైట పెట్టేటప్పటికి ఇరవై ఎకరాల రైతు పుల్లన్న తారసపడ్డాడు.

పుల్లన్న ముఖంలో చిమ్మచీకటి. కళ్లు ఉండాల్సిన చోట రెండు బొగ్గులు పొడుచుకొచ్చాయి. చెంపల నుంచి బూడిద పొట్టులా రాలుతోంది. పెదాలు నల్లగా కమిలిపోయాయి.

“నీకేమైంది మామా?” అన్నాడు పాతన్న.

“షాకు కొట్టిందిరా!” అన్నాడు పుల్లన్న.

“ఎప్పుడు?”

“ఇప్పుడే? ఊర్లోకి కరెంటోల్లు దిగినారు”

‘అయ్యో వానెమ్మ,’ అనుకుని అప్పు కోసం పెద్ద రెడ్డి ఇంటికి పరుగెత్తాడు పాతన్న. అతని ముప్పాతిక కండలు కరిగిపోయింది పెద్దరెడ్డి కింద కూలి మనిషి గానే!

పెద్దరెడ్డికి టౌనులో వ్యాపారాలున్నాయి. కంట్రా క్టులున్నాయి. అవి లాభాలదారిలో నడిచేందుకు రాజకీ యాలున్నాయి. అతనికి ప్లాస్టిక్ బిందెలు తయారుచేసే ఫ్యాక్టరీలో పావలా భాగముంది. మేనల్లుడి వస్త్రాల యంలో ముప్పావలా భాగముంది. వేరుశెనగ నూనె మిల్లు అతనిదే! ఈవిధంగా పల్లెలోని సంపదను పట్టణా లకు తరలించి చేసే వ్యాపారాల్లో పెద్దరెడ్డి తన కొడు క్కోసం కట్టించిన నాలుగంతస్తుల నర్సింగ్ హోమ్ కూడా ఒకటుంది.

పెద్దరెడ్డి ఇంటి ముందు గుంపుకూడిన కూలోల్లు. అతని చేన్లల్లో, తోటల్లో, దొడ్లల్లో కూలి జనులకు జరిగే టెండర్లు, పోటీ పెరుగుతోంది.

“ముప్పై,” అని అరిచాడొక కూలీ.

“నేను పదిహేనుకే వస్తా,” సన్నగా అరిచాడొకడు.

ఆ మూడోవాని టెండరుకు ఆమోదముద్ర వేసి కొంచెం సారం ఉన్న మనుషుల్ని కండలు పిసికి మరీ ఎంపిక చేసుకుని మిగతావాళ్లను పొండి అని తరిమే శాడు పెద్దిరెడ్డి.

కరెంటుబిల్లు కట్టడానికి పాతన్న అప్పు అడగ్గానే ఇంతెత్తుకు ఎగిరిపడ్డాడు రెడ్డి.

“అప్పులిమ్మని పీక్కు తింటారు కదరా దరిద్రం కొడకల్లారా! చెట్లకు కాస్తాయనుకుండారా దుడ్లు?”

“దుడ్లు చెట్లకు కాయవా? కాస్తాయను కుండానే?” అని ఆశ్చర్యపోయాడు పాతన్న. పాతన్న పండించిన వేరుశనక్కాయను తూకాలు పట్టి ఖరీదు చేసేవాడు పెద్దరెడ్డే!

“నీకు తల తిరుగుతోంది. పోరా లంజకొడకా!” అని పెద్దరెడ్డి గదురుకోగానే, ఉలిక్కిపడి వెనక్కు మళ్లాడు. ఇంతలో పెద్దరెడ్డి స్వంతమైన బోరు మిషన్

లారీ భయంకరంగా అట్టహాసం చేస్తూ రాకాసిలా ఎదురైంది. ఆ బోరు మిషన్లను పుట్టించే ఫ్యాక్టరీ ఇంకెంత భయంకరంగా ఉంటుందో తెలీదుగానీ - బోరు మిషన్‌లో జరిగే క్రీడా వినోదమొకటుంది. ఇరవైమంది వడ్డే కూలీలు ముప్పై దినాలు చేసే పనిని, ముగ్గురే ముగ్గురు పనివాళ్ల సాయంతో ఒక్క దినంలో ముగించేస్తుంది ఆ బోరు మిషన్.

తాను చూస్తున్నది నమ్మలేక కళ్లను మరోసారి నులుముకుని చూశాడు పాతన్న. సందేహం లేదు, వాడే! సల్లాడంలోని ఊసుపిర్రల్నుంచీ కిందికి పంగల కట్టెలా చీలిన పుల్లల్లాంటి కాళ్లతో నల్లగా బక్కగా వాడే! వడ్డే రాముడు!! తనను పెద్దరెడ్డి మనుషులు కసురు కుంటుంటే, పోయిన తన సమ్మెట కోసమూ, గదారు కోసమూ బోర్‌వెల్ మిషనంతా గాలిస్తున్నాడు.

*

ఇంటికొచ్చాడు పాతన్న. పేడదిబ్బ మాయమైంది. తాబేటి జన్మకు కృతార్థత లేదు. గంజు కింద మగ్గి మగ్గి బంగారమైపోయి బంగారం పండించే పేడదిబ్బ తనకిక లేదు.

అతడు కాలుగాలిన పిల్లిలా తిరుగుతుంటే- ''కరెంటోల్లు వచ్చినారు!'' అంది తాపీగా భార్య.

''ఆ! ఏరీ?'' అని పక్కనే బాంబు పడినట్టు అదిరి పడ్డాడు.

''వచ్చినారు, ఎల్లిపోయినారు,'' అంది రాగ యుక్తంగా భార్య.

''మన తోటలోని మిషిన్ ఫీజు పీక్కుపోయినా రేమో ముండా?'' అని గుండె పట్టుకున్నాడు.

''లేదు, కరెంటుబిల్లుకుగాను రెండు వడ్ల మూటలు ఎత్తుకుపోయినారు.''

తళతళా కాసింది ఎండ. పురివిప్పి నాట్య మాడాయి చెట్లు. సంతోషంగా గెంతినాయి పిచ్చుకలు. మాకు అర్థాంతరం చావు లేదన్నట్లు పచ్చపచ్చగా కులుకుతోంది పాతన్న తోటలోని పైరు! సన్నగా, పొడుగ్గా, గొంతు కింద ఎముకలు తేలి ఎంత చక్కగా ఉందిదీ! అని మూతి ముడుచుకున్న భార్యవైపు మురిపెంగా చూశాడు పాతన్న. వెంట్రుకవాసిలో ప్రమాదం తప్పించుకున్న మనిషిలా, ఆశ్చర్యంలోంచి తేరుకుని ఉల్లాసంగా నవ్వాడు.

''వాడేడీ? నీ ముద్దుల కొడుకు?'' అని అడిగాడు ఉత్సాహంగా.

''ఇంకెక్కడి కొడుకు?'' అని ఆకాశం పక్క చూసి, వెళ్లిపోయాడన్నట్లు చెయ్యూపిందామె.

చావు కబురు కూడా చల్లగా చెప్తుందిది. నమ్మ కూడదు అనుకుని, ''ఎక్కడికి పోయినాడే ముండా! సరిగా చెప్పి చావు,'' అని అరిచాడు.

''టౌనుకు పోయినాడు. పెద్దరెడ్డి కార్పొరేషన్ పట్టినాడంట. దాంట్లో పనిచేసేదానికి పోయినాడు.''

''కార్పొరేషనంటే?'' తల గోక్కుంటున్న భర్తను జాలిగా చూసింది భార్య.

''కోడి కింద రూపాయలు పొదిగిస్తారు చూడు, అదన్నమాట!''

నేనిక్కడ అప్పులు కట్టలేక చస్తుంటే, అక్కడ నా కొడుకు వడ్డీతో సహా అప్పులు వసూలు చేసి పెద్దరెడ్డి చేతిలో పోస్తుంటాడన్నమాట! అయితే, కొడుకు కూడా మాయమైపోయినాడన్నమాట!!

నీరసంగా కూలబడ్డాడు పాతన్న. గంట గడవక ముందే అతని కడుపులో పేగులు అరవడం ప్రారంభిం చాయి. ఆకలి!! అన్నిటికీ వస్తుంది మాయరోగం, ఈ ఆకలికెందుకు రాదో!! అని లేవబోయి, ఏదో నిస్సత్తువ ఆవరించి తూలిపడబోయాడు. కంబం పట్టుకుని తల విదిలించి చూశాడు. కళ్లలోకి ముద్దలు ముద్దలుగా కొట్టుకొస్తున్నాయి చీకట్లు. చీకటి తేపల మధ్య కొంచెం కొంచెం కరిగి మాయమై పోతున్న ఇల్లాలు.

తట్టలో అన్నం పెట్టింది భార్య. తినబోయాడు. నోటిదాకా వచ్చిన అన్నం ముద్ద మాయమై టౌనులో కాఫీహోటల్‌గా మారిపోయింది. మరో ముద్ద తిన బోయాడు. నోటిదాకా వచ్చిన అన్నంముద్ద మాయమై టౌనులో సినిమాహాలుగా మారిపోయింది.

''తిను,'' అంది భార్య మొగునివైపే చిత్రంగా చూసి. 'దీనికేమో అయింది. మాయమైన అన్నం ముద్దను తినమంటుందే?' ఉత్తచేతిని నోట్లో వేసుకుని నమిలాడు. భార్య పక్కన కూర్చుంటూ ఉంది. తన తలను ఆమె రొమ్ములపైకి లాక్కుని వెక్కివెక్కి ఏడుస్తూ ఉంది. ఎందుకేడుస్తోంది? దీనికి నెర్లు పుడితే అంతే!

''ఇదిగో! ఆ... అను'' అని చిన్నపిల్లవానికి తిని పించినట్లు తన నోట్లోకి అన్నం ముద్ద దురుకుతూ ఉంది భార్య! అప్పుడే ఆ ఇంటి వాకిట్లోకి, ఎవరిదో తల తొంగిచూసి పెద్ద కేకగా మారి అంతర్థానమైంది- ''ఓ పాతన్న బావా! ఊర్లోకి బ్యాంకోల్లు దిగినారంట లేయ్!''

అట్లే నోరు తెరిచినాడు పాతన్న, అన్నం ముద్ద కన్పించేట్లు. ''గుర్రాల మీద వస్తున్నారంట బ్యాంకోల్లు. పద పరుగెత్తు,'' అంటూ పామును చూసినట్లు పరసాల లోంచీ ఒక్క ఎగురు ఎగరి బైట చేన్ల కడ్డంపడి పరు

గెత్తాడు. అప్పలప్పలప్పలంటూ వెనకాల గుర్రాల రెక్కలచప్పుడు! దిక్కూ దివాణం లేకుండా పరుగెత్తి ఎడారి ఎదురైన నదిలా కాళ్లు చచ్చుబడి ఒక విశాలమైన రాతిబండపై కూలబడ్డాడు. తలలో చమటలు ఊటలు పీక్కొని ముఖం నిండా కారుతున్నాయి. దేహం ముద్ద ముద్ద అయిపోయింది.

*

పొద్దు మునిగింది. పున్నమి వెన్నెల్లో సున్నం కొట్టిన సమాధిలా ఉంది లోకం. ఏదో పక్షి ఆర్తిగా అరుచుకుంటూ వెళ్లిపోయింది. నిద్ర పోదామను కున్నాడు పాతన్న. కనురెప్పలు మాయం! కళ్లూ, నోరూ తెరుచుకుని శతాబ్దాల మూగభాషగా మిగిలాడు.

రాతిబండ కింద ఏదో చప్పుడు. బుర్రు బుర్రు మంటూ ఏదో పాకి వస్తోంది. అది కరకుగా తాకగానే, కిందికి జార్చిన కాళ్లను చప్పున పైకి తీసేసుకున్నాడు. బృహత్ శిలాయుగం నాటి రాక్షసగుడి అది! ఆ బండ కింద విశాలమైన అరలోంచి అస్తిపంజరం దేకుతూ వచ్చింది బైటికి! అది మెల్లగా లేచి నిలబడుతుంటే నోటమాట పడిపోయి చూస్తున్నాడు. విశ్వ వాతావరణం లోని మూలకాలు ఏఏ నిష్పత్తుల్లోనో సమ్మేళనం చెంది, అస్తిపంజరాన్ని జీవంతో తొణికిసలాడే కండల్తో, రక్తంతో, మూలుగతో నింపేశాయి.

తలా, గడ్డమూ తెల్లగా నెరిసిన నల్లటి ముసలి మనిషి తయారైపోయి- నోరు విప్పి మాట్లాడటం మొదలుపెట్టాడు

''భయపడొద్దు. నేనే! వందల సంవత్సరాల కిందట ఈ మట్టిలో ఆడుకున్నవాణ్ణి. నీకు మాదిరే రైతుని, నీ తాతని! ఈ రాక్షసగుడి నుంచి స్వర్గానికి సొరంగమార్గముంది. ఆకాశ సొరంగంలో కాంతిగా ఎగిరి, ఈ అస్తిపంజరంలోకి 'నేను'గా దూరి దేకుతూ వచ్చినాను. నీ కోసం! నీ బాధ నాకు తెలుసు. నీ ఇంట్లో ఏ వస్తువూ పెట్టినచోట ఉండదు. నువ్వు ముట్టు కున్నదల్లా మాయమైపోతుంది. ఆ మాయరోగం గురించి రహస్యం చెప్పడానికే ఇప్పుడు నేను వచ్చింది,'' చల్లగా దయగా నవ్వాడు. మన్నూ మిన్నూ ఏకమైన తొలకరి పరిమళం వేస్తోంది ముసలాయన నవ్వు.

''పట్టణాలు, నగరాల్లోని చదువులూ, ఉద్యో గాలూ, వ్యాపారాలూ, పరిశ్రమలూ, రాజకీయాలూ... ఇవెప్పుడైనా తిండిగింజలు పండించినాయా? ఇవన్నీ తమ జీవిక కోసం నీ మీద ఆధారపడి తింటూ, నీకే జీవిక లేకుండా చేస్తున్నాయి. నిన్ను భీరువును చేసి, బిచ్చగాన్ని చేసి, వెంటాడి తరుముతున్నాయి.

''నీ గ్రామంలోని సంపద నీ గ్రామంలో కాకుండా మరెక్కడో చదువులై, మరెక్కడో ఉద్యోగాలై, మరెక్కడో, మరెవరికో పరిశ్రమలూ, కళలూ, రాజకీయాలుగా మారుతున్నంత కాలం నీకూ నీ పల్లెకూ ఈ మాయ రోగం తప్పదు. మేలుకో! తిరగబడు! నీ శత్రువును నువ్వే కనుక్కో! అంతే నేను చెప్పవలసింది. వస్తాను. రైతు బిడ్డకు నా ఆశీస్సులు.''

ముసలాయన చిద్విలాసంగా నవ్వుతూ ఉండ గానే ఆయన ఒంట్లోంచి మూలకాల మేళవింపు విడి పోయి, విశ్వవాతావరణంలో కలిసిపోవడం మొదలు పెట్టాయి. అస్తిపంజరం భూమిపై మోకరిల్లి దేక్కుంటూ వెళ్లిపోయింది రాక్షసగుడిలోకి.

*

అప్పటికి పొద్దు పూర్తిగా తెల్లబడింది. తన రెక్కల ఆయి కింద భూమిని నిశ్శబ్దంగా పొదుగుతున్నాడు సూర్యుడు.

పాతన్న నిటారుగా నిలబడ్డాడు. తీక్షణంగా మారాయి చూపులు! శరీరంలోని సత్తువంతా పిడికిట్లో బిగించి పెద్దపెద్ద అంగలేస్తూ వచ్చాడు ఊళ్లోకి.

ఇంటి తలుపులు బార్లా తెరిచి ఉన్నాయి. భార్య ఎక్కడికి పారిపోయిందో పాపం! లోనికిపోయి చూస్తే చెంబూ, తట్టల్లాంటి వంటసామగ్రితో సహా పారా, పికాసీ, నాగలీ వంటి వ్యవసాయ పనిముట్లు మొత్తం మాయమైపోయాయి. యాత్రికులు ఖాళీ చేసి వెళ్లాక, మసిబారిన మూడురాళ్ల పొయ్యితో కన్పించే సత్రంలా ఇల్లంతా బోసిగా ఉంది. ఇంటిచూరులో చెక్కిన ఆ వేట కొడవలి బ్యాంకువాళ్ల కంటపడలేదు కాబోలు!

*

ఊరు ఊరంతా చానా గగ్గోలుగా ఉంది. సముద్రాల అవతల నుంచి ఎగిరొచ్చిన తెల్లదయ్యం మొకటి ఊర్లో అక్కడక్కడా జనాలకు కన్పిస్తోంది. మాకీ వ్యవసాయం వద్దు మొర్రో అని రైతులు భూములు వదిలేసి పారిపోతుంటే, ఆ భూముల్లో తెల్లదయ్యం ఇష్టారాజ్యంగా సంచరిస్తోంది. ఆ తెల్ల దయ్యానికీ, పెద్ద రెడ్డి రాజకీయానికీ ఏదో రహస్య సంబంధం ఉందంట.

అది ఒక చీకటి రాత్రి పెద్దరెడ్డికి కనపడి, పరీక్ష పెట్టిందంట. అది- కూర్చో అని గద్దిస్తే కూర్చున్నాడంట. లెయ్! అని అరిస్తే లేచి నిలబడ్డాడంట.

నా ముడ్డి నాకు అని శాసించిందంట. కాగితా లతో తుడుచుకునే ముడ్డి కదా ఘుమఘుమలాడు తొందని లొట్టలు వేసుకుంటూ నాకినాడంట. అప్పుడు అతని బానిసబుద్ధికి తెల్లదయ్యం సంతృప్తిగా తల

వూపి, ఫోర్ట్వంటీనో, ట్వంటీ ట్వంటీనో హైటెక్ క్షుద్ర రాజకీయవిద్యని పెద్దరెడ్డికి ప్రసాదించిందంట.

వేరుతో సహా పెకలిస్తే తప్ప, కయ్యల్లో కలుప పడిన తుంగగడ్డి పోదు. పాతన్న పెద్దరెడ్డిని తాత్కాలికంగా విడిచిపెట్టి తెల్లదయ్యాన్ని వెతికే పనిలోపడ్డాడు. అది కాకతాళీయంగా అతని పొలంలో కన్పించింది.

కళ్లలోకి ఏవో యంత్రాలు దించుకుని ఈ దేశం మట్టిమీదా, నీళ్లమీదా పరీక్షలు జరుపుతోంది. భూమిని జుట్టు పట్టుకుని కొరడాల్తో కొట్టి, నఖాగ్రాలతో చీల్చి లొంగదీసుకోజూస్తోంది. కయ్యల్లోని కూరగాయల పాదులూ, వరిపైరూ ధ్వంసం చేసి దయ్యాలు తినే తిండికోసమూ, దయ్యాల కొచ్చే జబ్బుల ఔషధాల కోసమూ వ్యాపారంలో మంత్రించిన రహస్యపు నల్లని విత్తనాలు చల్లుతోంది. ఆకలయిందేమో బహుశా. ఒక ఆవూ, మూడు గేదెలూ పిండిన బిందెడు పాలను చప్పరించి మింగింది. తరువాత ఆ పాడి పశువుల నుంచి కోసుకుని తెచ్చుకున్న నాలుగు పాల పొదుగుల్ని పచ్చి పచ్చిగా నమిలి తింటూ కూర్చుంది.

పాతన్న ముఖం జుగుప్సతో నిండిపోయింది. మనసులో తలచుకోగానే చేతిలో ప్రత్యక్షమైన యాట కొడవలితో తెల్లదయ్యాన్ని ఒక్క నరుకు నరికాడు.

"ఈ భూమి నాది..."

*

పెద్దరెడ్డి ఇంట్లో రూపాయల బస్తాలు బండ్ల కెత్తుతున్నారు. బస్తాల చిల్లుల్లోంచీ కారిపోయే రూకల్ని పుల్లలపరకతో కుప్పవేసి మరో సంచీలో మూటగడుతున్నారు. అవి పొలంలో పండినందుకు గుర్తుగా ప్రతి రూపాయి బిళ్ల మీదా మట్టి మరకలే! ఆ సంపదనంతా పట్టణానికి తరలించి బార్ అండ్ రెస్టారెంట్‌గా రూపాంతరం చెందించే ప్రక్రియ గురించి నిశ్శబ్దంగా ఆలోచిస్తున్నాడు పెద్దరెడ్డి.

రోజూలాగే ఆరోజు కూడా గ్లాసెడు కూలీల చెమటను గటగటా తాగి పారేసి మీసాలు దువ్వుకుంటూ లేచి నిలబడ్డాడు.

"ఇంక కదిలించండ్రా బండ్లు," అన్నాడు.

బండ్లు కదిలినాయంటే, నువ్వు చచ్చావన్నమాటే! అన్నట్లు తన గ్రామసంపదకు ఎదురుగా డామ్‌లా నిలబడి ఉన్నాడు పాతన్న, తెల్లదయ్యం ఎర్రరక్తంతో తడిసిన యాటకొడవలి ఊపుతూ. రూపాయికి రెండు వైపులా ధాన్యపు కంకులు కావలి కాయక తప్పదు.

సమీప భవిష్యత్తులో బల్బుల ఫ్యాక్టరీ ఒకటి పునరుత్పత్తి కాబోయే ఆ పల్లెలో అప్పుడు కొన్ని వందల కంతాలు మొలకెత్తాయి-

"ప్రపంచం కుగ్రామం కావడం కాదు.
కుగ్రామమే ఒక ప్రపంచం కావాలి."

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 11 మే 2003*

